ప్రజాశక్తి
గురువారం 17 అక్టోబర్ 2024

నేడు డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురం

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం డిఇఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తోట రమేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, బదిలీలకు అనుమతి ఇవ్వాలని, అర్బన్ ఎంఇఒలను నియమించాలని కోరుతూ దశల వారీగా పోరాటం చేస్తున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా గురువారం సాయంత్రం 4 గంటలకు డిఇఒ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాకు ఉపాధ్యాయులంతా హాజరు కావాలని కోరారు.

ప్రతిభకు పాతర

మన్యం జిల్లాలో ఉన్న ఏకైక గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాల, కళాశాలలో విద్యాప్రమాణాలు రోజురోజుకూ దిగజారుతున్న పరిస్థితి కనిపిస్తోంది. కంచే చేను మేసిన చందంగా గిరిజన గురుకులం సొసైటీ రాష్ట్ర అధికారులే తాజా పరిస్థితికి కారణమనే వాదనలు వినిపిస్తున్నాయి. కొద్దినెలల క్రితం బదిలీపై వెళ్లిపోయిన ప్రిన్సిపల్ వెంకట నాయుడు ఈ పాఠశాలలో క్వార్టర్‌ని ఖాళీ చేయడం లేదు. ఆయన క్వార్టర్ ఖాళీ చేయకపోవడంతో ప్రస్తుత ప్రిన్సిపల్ ధర్మరాజు స్థానికంగా నివాసం ఉండడం లేదు. దీంతో జోగింపేట గురుకుల ప్రతిభా పాఠశాల, కళాశాలలో విద్యా ప్రమాణాలు రోజురోజుకూ దిగజారుతున్నాయనే ఆందోళన విద్యార్థుల తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతోంది.

- జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో దిగజారుతున్న ప్రమాణాలు
- తాజా, మాజీ ప్రిన్సిపల్స్ తీరుపై విమర్శలు
- ఆస్పత్రి నిర్వహిస్తున్న అధ్యాపకుడు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న గురుకుల అధికారులు
- విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఆందోళన

ప్రజాశక్తి-పార్వతీపురం

వాస్తవంగా గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ స్థానికంగానే నివాసం ఉండాలి. విద్యార్థుల స్టడీ అవర్స్ జరిగేటట్లు చూసి విద్యా ప్రమాణాలు మెరుగు పరచడానికి కృషి చేయాలి. కానీ దీనికి భిన్నంగా సీతానగరం మండలం జోగింపేటలో ఉన్న గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాల, కళాశాలలో పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుత ప్రిన్సిపల్ ధర్మరాజు రోజూ ఇతర ప్రాంతానికి రాకపోకలు సాగిస్తున్నారు. ఎందుకు చేస్తున్నారంటే ప్రిన్సిపల్ క్వార్టర్ ఖాళీగా లేదని చెపుతున్నారు. దీనికి మూలకారణం గురుకులం సొసైటీ రాష్ట్ర అధికారులేనని స్పష్టంగా కనిపిస్తోంది. అరకు బదిలీపై వెళ్లిన ప్రిన్సిపల్ వెంకటనాయుడుకు గురుకులం సొసైటీలో పలుకుబడి ఉంది. గిరిజన గురుకుల అధ్యాపకుల సంఘం నాయకుడిగా ఉన్న వెంకట నాయుడు లాబీయింగ్ చేసుకుని మళ్లీ జోగింపేట పాఠశాలకు రావాలని తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అందుకే ఆయన క్వార్టర్ ఖాళీ చేయకుండా డ్రామా ఆడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆయన ఇక్కడకు డెప్యుటేషన్‌పై వస్తే తాను అరకు పాఠశాలకు డెప్యుటేషన్‌పై బదిలీ కావొచ్చునని ప్రస్తుత ప్రిన్సిపల్ ధర్మరాజు భావిస్తున్నారు. వీరిద్దరి డ్రామాలకు గురుకులం సొసైటీ రాష్ట్ర అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతం నుంచీ ఆరోపణలు

గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో ఉన్న గురుకులం సొసైటీలో లాబీయింగ్ చేసుకుని ఎలాగైనా జోగింపేటకు డెప్యుటేషన్‌పై రావాలని గత ప్రిన్సిపల్ వెంకటనాయుడు తహతహలాడుతున్నారు. ఆయన గతంలో పాచిపెంట మండలం పి.కోనవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో పని చేసినప్పుడు అవినీతి ఆరోపణలు వచ్చాయి. జోగింపేట పాఠశాల ప్రిన్సిపల్‌గా పని చేసినప్పుడు కూడా ఆయన అనేక అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలలో గోనె సంచులు, ఐరన్ స్క్రాప్ వంటి సరుకులను ఇష్టారాజ్యంగా విక్రయించడం, ఇంటర్ విద్యార్థులు రిలీవ్ అయిన తర్వాత వారి నుంచి పాఠ్యపుస్తకాలు తీసుకుని అమ్మడం వంటి అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. అంతే కాకుండా ఆయన ప్రిన్సిపల్‌గా పని చేసిన కాలంలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తగ్గిపోవడం, నీట్, ఐఐటి, జెఇఇ పరీక్షలలో ఒక్క ర్యాంకు కూడా సాధించలేదని పాఠశాల అధ్యాపకులే చెపుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మళ్లీ వెంకటనాయుడినే ప్రిన్సిపల్‌గా నియమిస్తే ప్రతిభా పాఠశాల ప్రతిష్ట మరింత కుంటుపడుతుందని గిరిజన సంఘాలు విమర్శిస్తున్నాయి.

మొక్కుబడిగా విధులకు..

స్థానిక ప్రతిభా కళాశాలలో పని చేస్తున్న ఒక అధ్యాపకుడు రోజూ మొక్కుబడిగా విధులకు హాజరై పార్వతీపురంలో ప్రయివేటు ఆసుపత్రి నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రిన్సిపల్ ధర్మరాజు అప్ అండ్ డౌన్ చేస్తుండడంతో కళాశాల అధ్యాపకులు కూడా ఎవరికి నచ్చిన రీతిలో వారు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా ఆ అధ్యాపకుడు కళాశాలకు వచ్చి తన క్లాస్ చెప్పిన తర్వాత పార్వతీపురం వెళ్లిపోయి ఆసుపత్రి వ్యవహారాలు చక్కబెట్టుకుంటున్నారనే ప్రచారం సాగుతోంది. ఇంత జరుగుతున్నా ఐటిడిఎ అధికారులు గాని, గురుకులం సొసైటీ అధికారులు గాని కిమ్మనడం లేదు. ప్రతిష్టాత్మకమైన ప్రతిభా పాఠశాల, కళాశాల ఔన్నత్యాన్ని నిలబెట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

పోక్సో కేసులో నిందితుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రాకేష్ (ఫైల్)

రైలుపట్టాలపై రాకేష్ మృతదేహం

బాలికపై అత్యాచారం కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితుడు మంగళవారం రాత్రి పోలీస్‌స్టేషన్ నుంచి తప్పించుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. స్టేషన్‌కు కూతవేటు దూరంలో రైలుపట్టాలపై బుధవారం ఉదయం శవంగా కనిపించాడు. ఈ సంఘటన పార్వతీపురం పట్టణంలో కలకలం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం... పార్వతీపురం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన కర్రి రాకేష్(18) ఇటీవల గ్రామంలోని ఒక బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి యువకుడిని విచారణ నిమిత్తం పార్వతీపురం రూరల్ ఎస్ఐ దినకర్ మంగళవారం రాత్రి స్టేషనుకు తీసుకొచ్చారు. స్టేషనుకు తీసుకువచ్చిన కొద్ది క్షణాల్లోనే నాటకీయంగా నిందితుడు రాకేష్ అక్కడి నుంచి తప్పించుకొని పరారయ్యాడు. పరారైన విషయాన్ని ఎస్ఐ వారి కుటుంబీకులకు తెలియజేశారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం ఉదయం బెలగాం రైల్వేస్టేషన్ శివారులో పట్టాలపై ఉన్న శవాన్ని రైల్వే పోలీసులు గుర్తించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు రాకేష్‌గా గుర్తించారు. కుమారుడి మరణ వార్త తెలుసుకున్న తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. పోలీసుల అదుపులో ఉన్న నిందితుడిని బయటకు ఎలా వదులుతారని రాకేష్ తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. యువకుడి మృతికి పోలీసులే బాధ్యత వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

గోపాలపురం గ్రామానికి చెందిన కర్రి అప్పడు, గౌరీ దంపతుల రెండో కుమారుడు రాకేష్. రాకేష్ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పెద్ద కుమారుడు రామకృష్ణ డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈ సంఘటనపై డివిజనల్ పోలీస్ అధికారి అంకిత సురాన, సిఐ గోవిందరావు సమగ్ర దర్యాప్తు నిర్వహించి, నివేదిక ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు.

సమగ్ర దర్యాప్తు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

పోలీస్ స్టేషన్‌కి దర్యాప్తు కోసం తీసుకెళ్లిన యువకుడు బలవన్మరణానికి పాల్పడటం విచారకరమని, దీనికి పోలీసులే బాధ్యత వహించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న యువకుడు స్టేషన్ నుంచి ఎలా తప్పించుకోగలిగాడని ప్రశ్నించారు. ఆత్మహత్యకు ప్రేరేపించిన సంఘటన నేపథ్యంపై విచారణ చేపట్టాలని కోరారు. యువకుడి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు.

జిల్లా విజన్‌పై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం



ధాన్యం కొనుగోలు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, అధికారులు

స్వర్ణాంధ్ర విజన్-2047లో భాగంగా రానున్న ఐదేళ్లలో జిల్లా విజన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రతి ఏడాది 15శాతం ఆర్థిక వృద్ధి ఉండేలా ముందస్తు ప్రణాళిక ఉండాలన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో స్వర్ణాంధ్ర విజన్-2047, రానున్న ఐదేళ్లలో జిల్లా విజన్ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక రంగంలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో వృద్ధి బాగా కనిపించాలని, ఆ దిశగా సంబంధిత అధికారులు చొరవ చూపాలని అన్నారు. వ్యవసాయ రంగంలో ఎకరాకు 2 వేల కిలోల ధాన్యం పండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీలైనంత వరకు సాగు ఖర్చు తగ్గించి, అధిక దిగుబడి వచ్చేలా చూడాలని అన్నారు. శాస్త్రీయ పద్ధతిలో వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రోన్, సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిరు ధాన్యాలు, ఆయిల్‌పామ్ పెంపకంపై కూడా దృష్టి సారించాలని చెప్పారు. వ్యవసాయంతో పాటు ఉద్యాన, మత్స్య రంగాల్లో వృద్ధి గణనీయంగా పెరగాలని స్పష్టం చేశారు. ఇందుకోసం ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకొని, వాటిని ఆచరించి చూపాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె. రాబర్ట్ పాల్, సిపిఒ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న అదనపు సౌకర్యాలు, నాణ్యత ప్రమాణాలు, కనీస మద్దతు ధర, రైతుల కోసం ప్రభుత్వం చేస్తున్న ఏర్పాట్లు రైతులకు అర్థమయ్యేలా రూపొందించిన మూడు రకాల పోస్టర్లను కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి ఆవిష్కరించారు. వీటిని రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలులో సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1967, 1800 -425 -0082 ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి కె. రాబర్ట్ పాల్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గిరిశిఖర గ్రామాల్లో భయం.. భయం

అటవీ ఫలసాయాన్ని నాశనం చేస్తున్న ఏనుగులు ● పొలాలకు వెళ్లాలంటేనే భయపడుతున్న గిరిజనులు

జీడితోటలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో తిత్తిరి పంచాయతీలో సీడిగూడ, పులిపుట్టి, తిత్తిరి తదితర గిరిశిఖర గ్రామాల్లో బుధవారం నాలుగు ఏనుగుల గుంపు సంచరించింది. పంటలను నాశనం చేస్తూ గ్రామాల పరిసరాల్లో తిరుగుతుండటంతో గిరిజనులు భయాందోళనకు గురవుతున్నారు. చీకటి పడితే జనావాసాల్లోకి, పంట పొలాల్లోకి ఏనుగులు రావడంతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని గిరిజనులు వాపోతున్నారు. జీడి, అరటి, పసుపు తదితర అటవీ ఫలసాయాలను నాశనం చేస్తున్నాయని, గ్రామాల మీద పడి ఎప్పుడు ఏమి చేస్తాయని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి తక్షణమే ఏనుగుల గుంపును జనావాసాల నుంచి దూరంగా తరలించాలని కోరారు.

ఏనుగులను తరలించాలి

కొమరాడ : కుంకి ఏనుగులను కర్ణాటక నుంచి వేగంగా రప్పించి మన్యం జిల్లాలో ఉన్న 11 ఏనుగులను అడవికి, లేకుంటే జూకి తరలించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొమరాడ మండలం కుమ్మరిగుంట పంచాయతీలో డంగభద్ర గ్రామంలో బుధవారం సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సాంబమూర్తి, గిరిజన సంఘం నాయకులు హెచ్.రామారావు మాట్లాడుతూ ఏనుగుల దాడిలో 11 మంది మరణించారని తెలిపారు. సుమారు రూ.6 కోట్ల వరకు పంట నష్టం వాటిల్లిందని చెప్పారు. ఏనుగుల భయంతో రైతులు ప్రతిరోజూ పొలాలకు వెళ్లలేకపోతున్నారని తెలిపారు. వెంటనే ఏనుగులను తరలించాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో వెంకట్రావు, లక్ష్మణరావు, బాల, రంగారావు పాల్గొన్నారు.

ఏనుగులను తరలించాలని ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు, గిరిజనులు

మద్యం దుకాణంలో తనిఖీలు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని జోగింపేట గ్రామంలో ఏర్పాటుచేసిన మద్యం దుకాణాన్ని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక ఆకస్మిక తనిఖీ చేశారు. నూతన మద్యం పాలసీలో భాగంగా బుధవారం నుంచి కొత్త మద్యం దుకాణాలు ప్రారంభమైన విషయం విదితమే. అందులో భాగంగా జోగింపేట మద్యం దుకాణాన్ని సందర్శించి, జాబితా ప్రకారం అన్ని సరిగా ఉన్నదీ, లేనిది ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి ఆమె స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే మద్యాన్ని విక్రయించాలని అక్కడి సిబ్బందిని ఆమె ఆదేశించారు. ఆమె వెంట తహశీల్దార్ ప్రసన్నకుమార్, ఆర్ఐ శ్రీనివాస్. విఆర్ఒలు సింహాచలం, గణపతి పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో తనిఖీలు చేస్తున్న జెసి శోభిక, ఎక్సైజ్ అధికారులు

భూసమస్యల పరిష్కారానికే గ్రామసభ

రికార్డులు తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం కోసమే గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ తెలిపారు. బుధవారం మండలంలోని లక్ష్మీనారాయణపురంలో జరిగిన గ్రామసభకు ఆయన హాజరయ్యారు. గ్రామసభకు విచ్చేసిన భూహక్కుదారుల పాసు పుస్తకాలు, రెవెన్యూ రికార్డులు, సవరణ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజమైన భూహక్కుదారునికి ఎటువంటి అన్యాయమూ జరగకుండా ఉండేందుకు, పాసు పుస్తకాలలో తప్పుగా నమోదైన విస్తీర్ణ కొలతలు, పేర్లు, చిరునామాలను సరిచేసేందుకు ఈ సభ ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఈ సభకు వచ్చిన వారందరూ తమ భూసమస్యలతో పాటు ఇతర సమస్యలను, సవరణలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నీలానగరంలో రెవెన్యూ సదస్సు

వీరఘట్టం : మండలంలోని నీలానగరం గ్రామంలో బుధవారం రీసర్వే గ్రామసభను తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎన్.లక్ష్మి నాయుడు, విఆర్ఒ నగేష్ పాల్గొన్నారు.

విశ్రాంతిగదిలో కానరాని ఫర్నిచర్

ఇంటి దొంగలపై చర్యలేవీ?

- తాత్సారం చేస్తోన్న మున్సిపల్ కమిషనర్!
- నిన్న ఫర్నిచర్ మాయం, మొన్న షాపు అద్దె గోల్ మాల్

ప్రజాశక్తి-సాలూరు

సాలూరు మున్సిపాలిటీలో ఇంటి దొంగలపై చర్యలు తీసుకోవడానికి అధికారులు తాత్సారం చేస్తున్నారు. సుమారు ఏడాది క్రితం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 20 నంబర్ షాపు అద్దె గోల్‌మాల్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీనిపై ఇంతవరకు ఏవిధమైన చర్యలూ తీసుకోలేదు. షాపు నిర్వహిస్తున్న యజమాని నుంచి అద్దె కూడా వసూలు చేయడం లేదు. మున్సిపల్ సమావేశం జరిగినప్పుడల్లా కౌన్సిలర్లు షాపు నెంబర్ 20 అద్దె గోల్‌మాల్ వ్యవహారంపై రచ్చ చేస్తున్నారు. 2017 నుంచి షాపును వినియోగిస్తున్న వ్యక్తి నుంచి అద్దె వసూలు చేయడం లేదు. సుమారు రూ.ఐదు లక్షల మేర అద్దె చెల్లించాల్సి ఉంది. కానీ ఇంతవరకు పైసా కూడా వసూలు చేయలేని స్థితిలో రెవిన్యూ అధికారులు ఉన్నారు. అద్దె చెల్లించలేదని యజమానే స్వయంగా అధికారులతో ఫోన్‌లో చెప్పారు. దీనిపై విజిలెన్స్‌కి ఫిర్యాదు చేస్తామని కౌన్సిలర్లు చెప్పారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ అధికారుల తప్పిదం కూడా స్పష్టంగా కనిపిస్తోంది. ఐదేళ్లుగా మున్సిపల్ షాపుని అద్దె చెల్లించకుండా వినియోగిస్తున్న యజమానికి అధికారులు కనీసం నోటీసు కూడా జారీ చేయడం లేదు. కొద్దిరోజుల క్రితం పట్టణ పారిశుధ్య విభాగానికి చెందిన గదిలో ఉన్న విలువైన ఫర్నిచర్ మాయమైన విషయం వెలుగులోకి వచ్చింది. సుమారు లక్ష రూపాయల విలువైన ఫర్నిచర్ కనిపించడం లేదని సాక్షాత్తూ మున్సిపల్ కార్మికులే ఆరోపిస్తున్నారు. దీనిపై ధర్నా కూడా చేశారు. ఇన్‌ఛార్జి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాజీవ్‌కి వినతిపత్రం కూడా అందజేశారు. ఇది జరిగి పది రోజులైనా ఇంతవరకు కమిషనర్ సత్యనారాయణ చర్యలు చేపట్టలేదు. కనీసం దీనిపై విచారణకు ఆదేశించలేదు. ఫర్నిచర్ మాయమైన విషయం తన దృష్టికి రాలేదని కమిషనర్ సత్యనారాయణ చెప్పడం చూస్తుంటే ఈ వ్యవహారాన్ని ఆయన తొక్కి పెట్టే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇంటి దొంగలను కాపాడే ప్రయత్నంలో మున్సిపల్ అధికారులు ఉన్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

రక్తహీనత నివారణకు చర్యలు

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

గర్భిణులు, కిశోర బాలికల్లో రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టాలని వైద్యారోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు వైద్యులకు సూచించారు. జియ్యమ్మవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ముందుగా గవరంపేట, ఎం.అల్లువాడ గ్రామాల్లో పర్యటించారు. పిల్లల్లో వ్యాధి నిరోధక టీకాలు ఏమేరకు వేస్తున్నారో పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లల బరువు, ఎదుగుదల స్థితి నమోదు రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం పిహెచ్‌సిలో రికార్డులు, ఆరోగ్య కార్యక్రమాలు ప్రగతి నివేదికలు పరిశీలించారు. ప్రతిరోజూ ఆరోగ్య తనిఖీలకు పిహెచ్‌సికి వస్తున్న వారిలో జ్వర లక్షణాలతో ఎంత మంది వస్తున్నారు, చేపడుతున్న నిర్ధారణ పరీక్షల వివరాలపై ఆరా తీశారు. వైద్య సిబ్బందితో పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించి, ఆయా సచివాలయ గ్రామాల వారీగా ప్రగతి నివేదికలు పరిశీలించారు. వెనుకబడి ఉన్న సిబ్బందిని ఆరా తీసి పురోగతి చెందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ముఖ్యంగా గర్భిణు, శిశువుల నమోదు త్వరగా జరగాలని ఆయన సూచించారు. రక్తహీనతగా గుర్తించిన ఉన్న గర్భిణులు, కిశోర బాలికలు, వారికి అందజేస్తున్న ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రల వివరాలు, ఏమేరకు హిమోగ్లోబిన్ శాతం వృద్ధి చెందుతుందీ పర్యవేక్షణ చేయడం అవసరమని తెలిపారు. సికిల్ సెల్ ఎనీమియాతో గుర్తించిన వారిని ప్రతి నెలా ఆరోగ్య పర్యవేక్షణ చేస్తూ హిమోగ్లోబిన్ శాతం తగ్గకుండా జాగ్రత్త పడాలన్నారు. సికిల్ సెల్ ఎనీమియా కార్డుల పంపిణీ పూర్తి చేసి ఆన్లైన్ నమోదు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు జగదీష్, సాయిప్రసన్న, సూపర్వైజర్లు లక్ష్మీకాంతం, శ్రీనివాసరావు, జయగౌడ్, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలుచేయాలి

ప్రజాశక్తి-కొమరాడ

గిరిజన చట్టాలను పకడ్బందీగా అమలు చేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వాకాడ ఇందిర డిమాండ్ చేశారు. కొమరాడ మండలంలోని పెద్దశాఖ గ్రామంలో బిడ్డిక మధు అధ్యక్షతన సిపిఎం శాఖా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆమె ఆవిష్కరించారు. సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, నాయకులు స్వామినాయుడు, జగన్నాథం, చింతామణి, రమేష్, కైలేష్, రంగారావు పాల్గొన్నారు.

కురుపాం.. స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంఇఒ సత్యనారాయణ

స్టడీ మెటీరియల్ వితరణ

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఎన్ఎంఎంఎస్ పరీక్ష కోసం సన్నద్ధమవుతున్న విద్యార్థులకు బుధవారం ఎస్ సొసైటీ ఆధ్వర్యంలో యూత్ ఫర్ సేవా సంస్థ సహకారంతో ఎంఇఒ ఎన్.సత్యనారాయణ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, స్కాలర్‌షిప్‌కు అర్హత పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, ఉపాధ్యాయులు ఆకుల జగదీష్, శేఖర్, సంతోష్ పాల్గొన్నారు.

కొమరాడ : మాడలింగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎన్ఎంఎంఎస్ పరీక్షకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ స్టడీ మెటీరియల్ అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సందర్శన

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని బాగువలస సచివాలయాన్ని ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు పట్టిక, సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది అందుబాటులో ఉండాలని, సమస్యలు పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. బాలకృష్ణాపురం, భద్రత గ్రామాలలో పల్లెపండగ కార్యక్రమంలో భాగంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభలో గుర్తించిన పనులను వెంటనే ప్రారంభించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాసరావు, భాగ్యవతి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ విజయభారతి

రావుపల్లిలో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలోని రావుపల్లి గ్రామంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పంటలో తెగుళ్ల ఆశించకుండా ఉండేలా రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రేగిడి విజయభారతి తెలిపారు. రైతు భరోసా కేంద్రంలో సర్పంచ్ బొంతాడ మహేశ్వరరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంటలో తెగుళ్లపై అవగాహన కల్పించారు. మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ఎస్ సురేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

112 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో నీలకంఠాపురంలో రూట్స్ సంస్థ ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి సహకారంతో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. ఈ శిబిరంలో 112 మందికి ఆప్తాలమిస్టు కంటి పరీక్షలు చేశారు. అందులో 42 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసినట్లు సంస్థ కార్యదర్శి వినోద్ కుమార్ తెలిపారు. వారిని విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో రూట్స్ సంస్థ, పుష్పగిరి కంటి ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

స్థిర ఆదాయం వచ్చేలా యూనిట్లు

మండలానికి ఒకటి ఏర్పాటు • కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో పిఎంఇజిపి (ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం) కింద ప్రతి మండలంలో ఒక యూనిట్ ప్రారంభం కావాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అధికారులను ఆదేశించారు. రానున్న 15 రోజుల్లో యూనిట్లు ప్రారంభానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. స్థిర ఆదాయం వచ్చే నూతన యూనిట్లను స్థాపించి ప్రజల జీవన ప్రమాణాలు పెరిగేలా చూడాలని అన్నారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాలో జీవనోపాధులపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిఎంఇజిపి ద్వారా జిల్లాలో అవసరమైన కొత్త యూనిట్ల స్థాపనకు అధికారులు కృషి చేయాలన్నారు. స్థిర ఆదాయం వచ్చే వ్యాపారాలపై దృష్టి సారించాలని చెప్పారు. యూనిట్ల స్థాపనకు అవసరమైన శిక్షణ కూడా ఇప్పించి, నవంబర్ 17 నాటికి ప్రారంభం కావాలని కలెక్టర్ ఉద్బోధించారు.

జిల్లాలో వన్ ధన్ వికాస కేంద్రాలు బాగా పనిచేసేలా మంచి వాతావరణం కల్పించాలని కలెక్టర్ తెలిపారు. సీతంపేట ప్రాంతంలోని అన్ని విడివికెలు నడవాలని, ఆ దిశగా ఎపిఎంలు చొరవ చూపాలని సూచించారు. కేవలం ఒక్క సీజనుకే పరిమితం కాకుండా ప్రతిరోజూ విడివికెల నుంచి వస్తువులు ఉత్పత్తి కావాలని ఆకాంక్షించారు. విడివికెలు ఉత్పత్తి చేసే వస్తువులకు ఆకర్షణీయమైన ప్యాకింగ్, డిజైన్ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పశు సంవర్ధక శాఖ ద్వారా గొర్రెలు పెంపకం యూనిట్లను స్థాపించాలని ఆదేశించారు. వచ్చే నెల 17వ తేదీకి 500 కుటుంబాలతో గొర్రెల పెంపకం యూనిట్లు ప్రారంభం కావాలన్నారు. చేనేత, జౌళి శాఖ ద్వారా సమత కార్యక్రమం కింద శిక్షణ ఇవ్వాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ద్వారా జిల్లాలోని యువతకు అవసరమైన శిక్షణ ఇచ్చి, వారికి ఉపాధి అవకాశాలు కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో ఐటిడిఎ ఎపిఒ, డిఆర్‌డిఎ, మెప్మా, పరిశ్రమలు, చేనేత, పశు సంవర్ధక, జిసిసి, నాబార్డు నుంచి అధికార ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లు ఆపాలి

ప్రజాశక్తి -జియ్యమ్మవలస

గ్యాస్ ఏజెన్సీ అక్రమ వసూళ్లు ఆపాలని వ్యవసాయ కార్మిక, ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు కొల్లి గంగునాయుడు, కె.సీతారాం, బి.మోహన్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం గ్యాస్ ఖాతాదారులతో వారు మాట్లాడి, అదనపు వసూళ్ల గురించి తెలుసుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ మండల కేంద్రానికి 5 కిలోమీటర్ల లోపల ఉన్న గ్రామాలకు రవాణా ఛార్జి లేకుండా గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయాల్సి ఉందన్నారు. కానీ ఒక్కో సిలిండర్‌కు రూ.70 అదనంగా చెల్లించకుంటే గ్యాస్ ఇవ్వడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారని తెలిపారు. రూ.830కు అందించాల్సిన సిలిండర్‌ను రూ.900కు లబ్ధిదారులకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. లబ్ధిదారుల ఇ-కెవైసికి గ్యాస్ ఏజెన్సీ డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సంఘంవలస సర్పంచ్ మృతి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండలంలోని సంఘంవలస సర్పంచ్ బడే చిట్టినాయుడు (80) బుధవారం మృతి చెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే జోగారావు ఆ గ్రామానికి చేరుకున్నారు. ఆయన కుమారుడు, ఉపసర్పంచి శ్రీరంజనకు సానుభూతి తెలియజేశారు. చిట్టినాయుడు మృతికి జెడ్‌పిటిసి బలగా రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, ఎఎంసి మాజీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి, సంతాపం తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ బొమ్మి రమేష్, బలగ నాగేశ్వరరావు, ఏళ్ల ప్రతాప్, మాజీ సర్పంచి అమరాపు రామకృష్ణ, ప్రముఖ వైద్యులు బడే సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిలో బోధనేతర సిబ్బంది ఉద్యోగాలకు 54 దరఖాస్తులు

ప్రజాశక్తి-బలిజిపేట

కెజిబివిలో బోధనేతర సిబ్బంది ఉద్యోగాలకు 54 దరఖాస్తులు అందినట్లు ఎంఇఒ సామల సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. చౌకీదార్, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్... మొత్తం మూడు పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. సెలక్షన్ ప్రక్రియ నిమిత్తం డిఇఒ కార్యాలయానికి దరఖాస్తులను పంపిస్తామని చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ పట్టుకుని వదిలేశారు

అన్న క్యాంటీన్‌కి వేశారని సర్దుబాటు • టిడిపి నాయకుల ఒత్తిళ్లతో నో యాక్షన్

ప్రజాశక్తి-సాలూరు

ఇసుక అక్రమ రవాణా విషయంలో అధికారులు.. అధికారపార్టీ నాయకులకో నిబంధన, ప్రతిపక్ష పార్టీ నాయకులకో నిబంధన అన్న చందంగా వ్యవహరిస్తున్నారు. టిడిపి నాయకులకు చెందిన ట్రాక్టర్లు ఇసుక రవాణా చేస్తే రెవెన్యూ, పోలీస్ అధికారులు చోద్యం చూస్తున్నారు. తమ దృష్టికి రాలేదని చెపుతున్నారు. అదే ప్రతిపక్ష పార్టీ నాయకుల ట్రాక్టర్‌తో ఇసుక రవాణా చేస్తే ఆగమేఘాలపై అక్కడ వాలిపోతున్నారు. ట్రాక్టర్‌ని సీజ్ చేసి కేసు నమోదు చేస్తున్నారు. పాచిపెంట మండలం పాంచాలి ఇసుక రీచ్ నుంచి స్థానిక టిడిపి నాయకుల ట్రాక్టర్లతో యథేచ్ఛగా ఇసుక రవాణా చేస్తున్నారు. పట్టణానికి ఇసుక ట్రాక్టర్‌తో సరఫరా చేస్తున్నారు. మంగళవారం పాంచాలి గెడ్డ నుంచి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆలీషా పట్టుకున్నారు. ఆ వాహనాన్ని తహశీల్దార్ కార్యాలయానికి తీసుకొచ్చారు. కేసు నమోదు చేస్తామని తహశీల్దార్ ఎస్‌వి రమణ కూడా చెప్పారు. ఆయన కార్యాలయంలో లేని సమయం చూసి ట్రాక్టర్ యజమాని దర్జాగా ట్రాక్టర్‌ని తీసుకెళ్లిపోయాడు. మంగళవారం సాయంత్రం టిడిపి నాయకులు తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి మంత్రాంగం సాగించడంతో తహశీల్దార్ రమణ ప్లేట్ ఫిరాయించారు. ఆ ట్రాక్టర్ ఇసుక అన్న క్యాంటీన్ కోసం వేశారని తహశీల్దార్ రమణ చెప్పడం గమనార్హం. దీనిపై బుధవారం విలేకరులు తహశీల్దార్ రమణని వివరణ కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి కేసు నమోదు చేస్తామని చెప్పడం కొసమెరుపు. ఇదిలా ఉండగా, పాంచాలి ఇసుక రీచ్‌పై స్థానిక టిడిపి నాయకులు గుత్తాధిపత్యం వహిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. మంత్రి సంధ్యారాణి అండదండలు పుష్కలంగా ఉన్నాయనే ధీమాతో ఆ నాయకుడు ఇసుక రీచ్‌లోకి టిడిపి నాయకుల ట్రాక్టర్లు, నాటుబళ్లకే అనుమతిస్తుండడం వివాదాస్పదం అవుతోంది. కొద్ది రోజులుగా ఆ నాయకుడి ట్రాక్టర్‌తోనే ఇసుక ఇష్టారాజ్యంగా రవాణా చేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. రాత్రి వేళల్లో ఆ టిడిపి నాయకుడు ఇసుకని తరలిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

పల్లె పండగతోనే గ్రామాల అభివృద్ధి

కురుపాం.. సిసి రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న టిడిపి నేత కొండయ్య

ప్రజాశక్తి - కురుపాం

పల్లె పండగ కార్యక్రమంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని టిడిపి మండల కన్వీనర్ కె.వి కొండయ్య అన్నారు. బుధవారం మండలంలో వబ్బంగి పంచాయతీలో ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ఉపాధి హామీ నిధులతో సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ నేరేడుబిల్లి వంశి, ఇఒపిఆర్‌డి జి.రమేష్ బాబు, ఎపిఒ పి.బావాజీ, మండల ఇంజనీరింగ్ అధికారి పి.నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కె.చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలో మరుపెంట, రావుపల్లి, రావివలస గ్రామ పంచాయతీల్లో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణ పనులకు సర్పంచులు ఉరిటి నిర్మల, బొంతాడ మహేశ్వర రావు, ఎంపిటిసి సభ్యులు కోట భరత్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, పంచాయతీ కార్యదర్శి బలగ వెంకటసాయికృష్ణ, జెఇ మరిశర్ల హరికృష్ణ, క్షేత్ర సహాయకులు యేగిరెడ్డి పోలినాయుడు, అక్కేన రామకృష్ణ, కుసిరెడ్డి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : మండలంలోని కత్తులకవిటి, ఎం.రాజపురం గ్రామాల్లో బుధవారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. తోటపల్లి ప్రాజెక్టు మాజీ చైర్మన్ నిమ్మక పాండురంగ ఇంకుడు గుంతకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నిమ్మక రవణమ్మ, జెడ్‌పిటిసి జంపు కన్నతల్లి, ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపిటిసి రౌతు రంగారావు, పంచాయతీరాజ్ జెఇ డి.కళ్యాణదుర్గ, ఎపిఒ జి.సత్యంనాయుడు, రౌతు కృష్ణంనాయుడు, జి.గౌడ్‌నాయుడు పాల్గొన్నారు.

వీరఘట్టం.. ఇంకుడు గుంతకు భూమిపూజ చేస్తున్న పాండురంగ, నాయకులు

ఆశ్రమ పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో దోనుబాయి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను సీతంపేట ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ పి.నారాయుడు బుధవారం సందర్శించారు. 310 మంది విద్యార్థులకు గాను 190 మంది విద్యార్థులు ఉండటాన్ని ఆయన గుర్తించారు. మిగతా విద్యార్థులంతా సాయంత్రానికల్లా చేరేలా చూడాలని ఉపాధ్యాయ సిబ్బందికి ఆదేశించారు. గ్రామాల్లోకి కొంతమంది ఉపాధ్యాయులను పంపించి విద్యార్థులను రప్పించాలని సూచించారు. అనంతరం విద్యార్థుల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాన్ని పరిశీలించారు. పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయేంద్ర, ఆర్‌సి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాప్ ను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ నారాయుడు

హాజరు శాతం పెంచాలి

పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని ఐటిడిఎ ఎపిఒ జి.చిన్నబాబు అన్నారు. మండలంలోని పెద్దపొల్ల ఆశ్రమ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టికలను పరిశీలించారు. విద్యార్థుల కోసం వైద్య శిబిరం ఏర్పాటు చేసి సాధారణ వైద్య పరీక్షలు చేయాలని సూచించారు. పాఠశాలలో భోజన మెనూ పరిశీలించారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తరగతి గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఎం.భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు రవి, తదితరులు పాల్గొన్నారు.

ఇంకా 60మంది అతిసార బాధితులు

- తాజాగా చేరిన మరో ఇద్దరు
- కోలుకుంటున్న రోగులు
- పరామర్శించిన కలెక్టర్, జెడ్‌పి చైర్మన్, ఎస్‌టి కమిషన్ చైర్మన్
- కలుషిత నీరే కారణం

గుర్ల జెడ్‌పి హైస్కూలులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్న బాధితులు

ప్రజాశక్తి-గుర్ల

మండలంలోని గుర్ల, ఘోషాడ, పున్నపురెడ్డిపేట, గూడెం, కెల్ల గ్రామాల్లో నాలుగు రోజుల క్రితం ప్రబలిన అతిసార గుర్ల, ఘోషాడ గ్రామాల్లో ఇంకా అదుపులోకి రాలేదు. ఓవైపు బాధితులు కోలుకుంటుండగా, తాజాగా బుధవారం గుర్ల గ్రామానికి చెందిన మరో ఇద్దరు వైద్య శిబిరంలో చేరారు. గుర్ల గ్రామానికి చెందిన వారు సోమవారం ఒకరు, మంగళవారం నలుగురు మృతి చెందడంతో అధికార యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. ప్రస్తుతం గుర్లలోని జెడ్‌పి హైస్కూలులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 52మంది, జిల్లాకేంద్రాస్పత్రిలో నలుగురు, చీపురుపల్లి సిహెచ్‌సిలో నలుగురు మొత్తంగా 60మంది చికిత్స పొందుతున్నారు. వీరంతా గుర్ల, ఘోషాడ గ్రామాలకు చెందిన వారే. వీరిలో ఎం.నాగరాజు, ఎన్.అప్పలస్వామి, జె.పైడమ్మ, జి.రాములమ్మ, అప్పలనర్సమ్మ తదితరులు ఉన్నారు.

ఆర్‌డిఒ, డిఎంహెచ్ఒతో మాట్లాడుతున్న విజయనగరం కలెక్టర్ అంబేద్కర్

అతిసార అదుపులో ఉంది
కలెక్టర్ అంబేద్కర్

గుర్లలో డయేరియా అదుపులో ఉందని, ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. అతిసారతో బాధపడుతున్న వారి కోసం మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేసి వైద్యం అందిస్తున్నామని తెలిపారు. పూర్తిగా కోలుకున్న తర్వాతనే వారిని ఇంటికి పంపిస్తామన్నారు. బుధవారం కలెక్టర్ గుర్ల లో పర్యటించి అతిసారతో బాధపడుతున్న వారిని పరామర్శించి, కారణాల పై ఆరా తీసారు. మొదటి రోజున విరేచనాలు తగ్గిన వారు ఇళ్లకు వెళ్ళడం, వారు వినియోగించిన టాయిలెట్లను వారి కుటుంబ సభ్యులు వినియోగించడం వలన మిగిలిన వారికి సోకినట్లు గుర్తించామని తెలిపారు. కలుషిత నీరు తాగడం వల్ల కూడా డయేరియా సోకి ఉంటుందని తెలిపారు. గుర్ల గ్రామంలో 5బోర్లలో నీరు కలుషితమైనట్లు అధికారులు గుర్తించా రన్నారు. వాటిని పూర్తిగా వాడకుండా చేయాలని ఆదేశించామన్నారు. ఇప్పటి వరకు ఎవరూ డయేరియా వ్యాధితో మతి చెందలేదని, చనిపోయిన వారు గుండెపోటు, మూత్రపిండాల వ్యాధులతో బాధపడుతున్న వారని తెలిపారు. వాస్తవ పరిస్థితుల పై వెంటనే నివేదిక నివ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రతి ఇంటికీ వెళ్లి బ్లీచింగ్, స్ప్రే చేయాలని, కేసులు పెరగకుండా చర్యలు తీసుకోవాలని డిపిఒకు ఆదేశించారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చంపావతి నీటి ప్రవాహం లో ఎగువ ప్రాంతం నుండి కాళేబరాలు కొట్టుకురావడం వల్లనే నీరు కలుషితం అయి గుర్ల లో అతిసారం ప్రబలింది అనే ప్రచారం అపోహ మాత్రమేనని కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ఉమా శంకర్, డిఎంహెచ్ఒ డాక్టర్ భాస్కరరావు, డిపిఒ వెంకటేశ్వర రావు, చీపురుపల్లి ఆర్‌డిఒ సత్య వాణి, తహశీల్దార్ ఆదిలక్ష్మి, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు బోరుబావుల్లో నీరు కలుషితం

గుర్ల గ్రామంలో ఐదు బోరు బావుల నీటి శాంపిల్స్ ను పరీక్షించామని, 5 ప్రైవేటు బోరు బావుల నీరు కలుషితంగా ఉందని ఆర్‌డబ్ల్యుఎస్ఇ ఉమా శంకర్ తెలిపారు. వెంటనే వాటిని సీజ్ చేయాలనీ, ఇంటింటికి క్లోరినేటెడ్ నీటిని సరఫరా చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలి : జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

విజయనగరంటౌన్, గుర్ల : గుర్లలోని వైద్యశిబిరంలోను, జిల్లా కేంద్రాస్పత్రిలోను అతిసారతో బాధపడుతున్న బాధితులను జెడ్‌పిచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పరామర్శించారు. వారి కుటుంబసభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నలుగురు మతి చెందినా తాగునీటి సరఫరా లోపాలను సరిదిద్దేవారే లేరన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం స్పందించాలన్నారు. బాధ్యత తీసుకొని సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వెంటనే ఇంటింటి సర్వే నిర్వహించి, అవసరమైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. జెడ్‌పిలో నిధులకు కొరత లేదని, వెంటనే శానిటేషన్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్‌తో మాట్లాడి అతిసారానికి కారణాలను అడిగారు. జిల్లా పరిషత్‌లో నిధులు ఉన్నాయని, వెంటనే పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్‌కు తెలిపారు. ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డిలు గ్రామం మొత్తం బ్లీచింగ్, క్లోరినేషన్ చేయాలని సూచించారు.

ఎస్‌టి కమిషన్ చైర్మన్ పరామర్శ

జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర రావు పరామర్శించారు. గ్రామంలో అతిసార ఉత్పన్నమైన పరిస్థితులు, ప్రస్తుతం వారి ఆరోగ్యస్థితి వాకబు చేశారు. వైద్యులను, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అప్పలనాయుడును రోగులకందుతున్న చికిత్స వివరాలపై ఆరా తీశారు.మెరుగైన వైద్యసేవలు అందించమని కోరారు. గ్రామాల్లో క్షేత్ర స్థాయి ప్రభుత్వ యంత్రాంగాన్ని సమన్వయ పరిచి, అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేరాలు ఘోరాలు

ఆటోను ఢీకొన్న బస్సు

ఒకరు మృతి.. ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని ఖడ్గవలస జంక్షన్ సమీపంలో పిట్టలమెట్ట బస్టాప్ దగ్గర బుధవారం ఆటోను ఆర్‌టిసి బస్సు ఢీకొంది. దీంతో ఒకరు మృతిచెందారు. ఇద్దరికి గాయాల య్యాయి. పోలీసుల కథనం ప్రకారం..

ప్రమాదంలో మరణించిన యశోదమ్మ

పార్వతీపురం నుంచి పాలకొండ వైపు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు ఎదురుగా పార్వతీపురం వైపు వస్తున్న ఆటోని ఢీకొంది. దీంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న వీరఘట్టం గ్రామానికి చెందిన యందవ యశోదమ్మ (47) అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా, అతివేగంగా రోడ్డుకు కుడివైపు వచ్చి ఆటోను ఢీకొన్నట్లు స్థానికులు చెబుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను అదే ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రాము తెలిపారు.

వీరఘట్టంలో విషాదఛాయలు

వీరఘట్టం : వీరఘట్టంలోని జగ్జీవన్‌రామ్ కాలనీకి చెందిన యందవ యశోదమ్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పార్వతీపురంలో కంటి ఆసుపత్రికి వెళ్లి తనిఖీ చేయించుకునేందుకు వెళ్తున్నానని ఇరుగు పొరుగు వారితో చెప్పి వీరఘట్టంలో ఆటో ఎక్కారు. కొద్దిసేపటికే ఆమె మరణ వార్త వినడంతో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆమెకు భర్త వెంకటి, కుమార్తె వెంకటలక్ష్మి ఉన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలో సీతానగరం రైల్వేస్టేషన్ హడ్కోకాలనీ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (55) మృతదేహం లభ్యమైంది. తెల్ల రంగు ఫుల్‌హాండ్స్ కమీజు, బ్లూ రెడ్ రంగు కలిసిన లాల్చీ ధరించాడు. మృతదేహాన్ని విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. మృతదేహం వద్ద గుర్తుపట్టేందుకు ఎలాంటి ఆధారాలూ లేవని బొబ్బిలి రైల్వే పోలీసులు చెబుతున్నారు. మృతుడికి సంబంధించిన ఆచూకీ తెలిస్తే విజయనగరం రైల్వే - 9490617089, బొబ్బిలి రైల్వే అవుట్ పోస్టు ఇన్‌ఛార్జి 9491813163, 8309901038 నంబర్లకు తెలియజేయాలని కోరారు.